# ప్రేయసి + పెళ్ళాం - నేను

-కందుకూరి వెంకట మహాలక్ష్మి

**అం**దరాడపిల్లలకి లాగా మహతి కూడా కోటానుకోట్ల కోరికలతో, ఊహాగానాల్లో కట్టుకున్న ఆశాసౌధంల్లోని ఊయలలో ఊగుతూ ఆ గదిలోకి అడుగెట్టింది. అణు వణువు సిగ్గుతో పులకించిపోతోంది. మనసంతా ఆనం దంతో వణుకుతోంది. బుగ్గలు కెంపులయి, స్త్రీకి సిగ్గే సింగారమన్నదానికి చిహ్నంగా తల నేలకొరిగి పోయింది. గదిలోకి అడుగెట్టిన మహతి మనసు గిలిగింతలు పెట్టి, శ్రీకాంత్ దగ్గరకి పరిగెడుతోంది. కానీ సిగ్గు అడుగు ముందుకెయ్యనివ్వకుండా ఆపే స్తోంది. ఈ రెండింటి మధ్యా సతమతం అవుతోన్న ఆమెని 'మహతీ! యిలా వచ్చి కూర్చో' అన్న శ్రీకాంత్ పిలుపు ఒళ్ళంతా కరెంట్ తీగ తగిలినట్లు ఝల్లుమంది. నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ మంచం దగ్గరగా వెళ్ళి నిలబడింది. 'కూర్చో' అని తనపక్కనే చోటు చూపించాడు శ్రీకాంత్. మేను పులకరించగా సిగ్గుతో మరింత మల్లెమొగ్గలా ముడుచుకుపోతూ నెమ్మ దిగా అతని పక్కనే కూర్చున్న మహతి ఇక ప్రతీక్షణం ఎలాంటి తియ్యటి కొత్త అనుభవాల్ని ఎదుర్కోవాలో అన్న భీతి, పులకింతలతో ముఖమంతా సింధూర వర్ణం దాల్చసాగింది.

పక్కని కూర్చున్న మహతిని ఎన్నో అడిగాడు. మరెన్నో చెప్పాడు. అందులో సొంత విషయాలున్నాయి. కాలేజీ విషయాలున్నాయి. చిన్ననాటి ముచ్చట్లున్నాయి. అంతా ఓ యిద్దరి స్నేహితుల మధ్య జరిగే సంభా షణలా! మరి కాస్సేపటికి ప్రాణ స్నేహితుల మధ్య కబుర్లల్లా! ఆ తరువాత నిద్ర వస్తోంది మహతీ ఈ పెళ్ళి పనుల్తో బాగా అలసిపోయాను. పైగా రాత్రి లగ్న మొకటి – నువ్వూ అలసిపోయివుంటావు పడుకో" అంటూ ఆవలిస్తూనే నడుం వాల్చాడు.

పొంగుతున్న పాలమీద నీళ్ళు చిలకరించినట్లుగా అయింది. ఒక్కసారిగా ఆకాశం నుంచి నేలమీదకి జారిపోయినట్లుగా, ఊగుతున్న ఊయల తెగి నేలమీద పడ్డట్లుగా అయిపోయింది. కోటానుకోట్ల కోరికలు కరడుగట్టేసాయి. చిందర వందరయిన మనసుని అదుపులోకి తెచ్చుకోలేక వెర్రిదానిలా ఓసారి శ్రీకాంత్ వైపుకి చూసింది. తనకేమీ పట్టనట్లు నిద్రపోతున్న భర్తవైపు చూసి ఉక్రోషం ఆపుకోలేకపోయింది. మరి కొంత సేపటికి స్త్రీ సహజమైన బలహీనతతో కళ్ళంట నీళ్ళు రాగా కొంగు అడ్డుపెట్టుకుని కారుతున్న కన్నీటికి ఆనకట్ట కట్టింది.

'మహతీ'! అన్న తల్లి పిలుపుకి కుర్చీలో పడుకున్న మహతిని 'తెల్లవారిపోయిందోయ్!' అంటూ ఎర్రగా కనబడుతున్న సూర్యుడు కిటికీలోంచి వెక్కిరిస్తున్నట్లు కనబడి 'తెల్లవారిపోయిందా?' అనుకుంటూ ఉలిక్కిపడి లేచి తలలో నలగని మల్లెల్ని, మడత నలగని చీరని ఓసారి పిచ్చిదానిలా చూసుకుని తడుముకుని తలుపు తీసి బైటకొచ్చింది.

మొదటిరాత్రి అనుభవాన్ని చెప్పమంటూ స్నేహితు రాళ్ళు చేసే అల్లరి, "కళ్ళంత ఎర్రగా వున్నాయి రాత్రల్లా నిద్రపోలేదా?" అంటూ వదినలు ఆడే పరిహాసాలు మనసంతా ములుకుల్లా గుచ్చుకుంటూంటే ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, లేని గంభీరతతో వారివైపు చూసి మౌనంగా వుండిపోయింది.

మూడు రాత్రులయి తిరిగెడుతున్న శ్రీకాంత్‌తో "మళ్ళీ మనం కలవడం ఎన్నాళ్ళకో?" అంది. "అవును ఇల్లు దొరగ్గానే రాస్తా" అన్నాడు పొడిగా. "మరి ఈ ఎడబాటు గుర్తురానీకుండా, మీరు గుర్తొచ్చేలా ఓ తియ్యటి ముద్దన్నా యివ్వరూ?" అని బేలగా అడుగు తున్న మహతిని చూస్తూ "సారీ! నాకేమిటో అలాంటివి చేతకావు. నా ప్రవర్తనకి సిగ్గుపడుతున్నాను. ఏమీ అనుకోకు" అన్న శ్రీకాంత్ మాటలు మహతి చెంపమీద ఛెళ్ళుమని కొట్టినట్లనిపించి, ఒక్కసారి సీరియస్‌గా

## సిగరెట్ బో(బా)ధ

**ఓ** మనిషీ
నాలా నీవూ
అవుతావు నుసి
నన్ను కాల్చటానికి
నీకెందుకంత కసి
నీ ఆరోగ్యం కాపాడుకో
నన్ను మరచి / బ్రతకగలవులే
హాయిగా / నన్ను విడిచి

-సింగిడి రామారావు

అతన్ని చూసి అవమానంతో మళ్ళీ తలదించుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

'ఒక్క ముద్దు యిచ్చి వుంటే ఎడబాటన్నిరోజులూ గుర్తుండేది. కానీ ఈ జవాబు జీవితమంతా గుర్తుంటుంది' అనుకుంది మనసు దెబ్బతిన్న మహతి.

పెళ్ళికి ముందు రాత్రులు అక్కచెల్లెళ్ళ సరసన పడుకునేది. ఈ మూడు రాత్రులు ఓ కొత్త పురుషుని గదిలో పడుకుంది. మహతి మెడలో పసుపుతాడుకి వేలాడుతున్న మంగళసూత్రాలు మాత్రం తన కన్యత్వాన్ని చెడగొట్టిన గుర్తుగా తళతళ మెరుస్తూ వెక్కిరిస్తున్నాయి.

ఏవిధమైన ఉత్తేజాలూ, ఉరకలూ లేకుండా రోజులు గిర్రున తిరిగిపోతున్నాయి కాపరానికొచ్చిన మహతి జీవితంలో. సినిమాల్లో, నవలల్లో విధంగా తన జీవితంలో ఎన్నడూ ఒకరి కోసం ఒకరు ఎదురు చూడటం గానీ, రాగానే ఉద్రేకాలతో, సరసాలతో కాలక్షేపం చెయ్యడం గానీ ఎరగని మహతి, కథలు సినిమాలు వేరు - ఇది జీవితం - ఇది యిలాగే సాగుతుంది కాబోలు" అనుకుంది. నెమ్మదిగా ఆ జీవితానికి అలవాటు పడిపోయింది. తను భార్య, అతను తన భర్త. భార్యాభర్తలు కలిసి జీవించడానికి ఆడదానిగా తన కర్తవ్యం తను నిర్వహిస్తోంది. కొద్దికాలంగా కోరిక కలిగినప్పుడు మహతిని చేరదీస్తున్నాడు. అదన్నా ఏ ఆలనా పాలనా లేకుండా, దంపతుల మధ్య వుండవలసిన ఉల్లాసం, సరసం ఏమాత్రం లేకుండానే! మహతిని ఒక వస్తువుని వాడుకున్నట్లుగా వాడుకునేవాడు.

సంఘం, గౌరవం, కుటుంబాల పరపతి, పరువు, ప్రతిష్ఠలు మహతి నోటికి తాళంవెయ్యగా, ఆ జీవితానికి అలవాటుపడింది.

పుస్తకం చదువుతున్న మహతికి 'పోస్టు' అన్న కేక వినపడగా బైటికెళ్ళి ఉత్తరం తీసుకుంది.

ఆ కవరు తనకే! "ఎవరిదో కొత్త రాత" అనుకుంటూనే కవరు చింపింది. అందులో శ్రీకాంత్ కామితకి రాసిన ప్రేమలేఖని కామిత వేరే కవర్లో పెట్టి తన ఎడ్రసుకి తిప్పి పంపిస్తూ "మీ వారికి బుద్ధి చెప్పుకోండి" అని మాత్రం ఓ స్లిప్ రాసి పెట్టింది. ఆ ప్రేమలేఖ చదివిన మహతి మనసు భగ్గున మండిపోయింది. మనసులో కలిగిన అసహ్యాన్ని, వివిధ భావాలని అణుచుకోలేక ఆ ఉత్తరం పెట్టె అడుగున పడేసి మంచంపై వాలిపోయింది.

## అక్షర నీరాజనం...!!

తెలుగు భాష మన మాతృభాష
దానిని అభ్యసించటం మన అభిలాష...!
చిన్నారులకు చేసే అక్షరాభ్యాసం
అది... సరస్వతీ కరుణా కటాక్షం...!!
తేనెలొలికే తియ్యదనం... అదే
మన సమగ్ర తెలుగు సాహిత్యం...!
తనివి తీరా దానిని ఆస్వాదించటం
మన తెలుగు వారి పూర్వజన్మ సుకృతం...!!
తల్లి ఒడిలో నిద్రించే పాపలకు
తొలి పాటలే శ్రవణానందకరం...!
పురాణ కథా శ్రవణం పిల్లలలో
కలిగే స్వభాషాభిమాన చైతన్యం..!!
పద్యాలు వల్లిస్తూ పరవశించే బాలల
ఆనందానుభూతులు అనిర్వచనీయం...!
వాల్మీకి, పోతన, త్యాగరాజు, రామదాసు
అన్నమయ్య లాంటి వారు మన ప్రాచీన
తెలుగు సాహిత్య వైభవానికి వైతాళికులు...!!
ఆ మహనీయుల పాదపద్మాలకు
నమస్కరించటం మన సంస్కారం...!
నేటి మన విద్యా ప్రమాణాల
తీరుతెన్నులు అగమ్యగోచరం...!
దాని సమూల ప్రక్షాళనకు... నేటి
విద్యావేత్తల పరిష్కారమార్గాలు శిరోధార్యం..!!
మన తెలుగు భాషకు ప్రాచీన హోదాను
ఆవిష్కరించటం మేధావుల కృషికి నిదర్శనం...!
అమ్మా... నాన్నల పిలుపు మనకెంతో ముద్దు
మమ్మీ... డాడీలనే ఆంగ్ల పదాలు పలకవద్దు...!
'దేశ భాషలందు తెలుగు లెస్స'... అన్న
నానుడి స్వభాషాభిమానులకు గర్వకారణం...!!
తెలుగు తల్లి మెడలో దేదీప్యమానంగా మెరిసే
అక్షరాల ఆణిముత్యాల మణిహారం
మాతృభాషకు ఆంధ్రులందరూ
అర్పించే... అక్షర నీరాజనం...!!

-తంగెళ్ల పాండురంగశర్మ

# తెలుగు మన వెలుగు

తెలుగు మన వెలుగు / మదిన మేలుకొలుపు
మాటలొలుక బోస్తూ / మధురాల మధువు పంచు
మృధుపాలు మదిలో నింపు
మమకార మమత పొంగు
మురిపాల సంద్రమవ్వు / అనురాగ అలల కొలువు
మన తెలుగుకున్న బిగువు
మరువకుమా నీవు?! ॥తెలుగు॥
పలుకు చిలక, పిలుపు మురళి
నడక నెమలి, పాట కోయిల
ఆట పైరు అచ్చ తెలుగు
అలరారే మన తెలుగు / భాషల్లో ఘనకీర్తి!
ద్విత్వమైన దీర్ఘమైన / సున్నయైన విసర్గయైన
కలగలసి ధ్వనించే / నుడికారపు సొగసులు!
అక్షరాల కూర్పురమ్య
పద బంధపు గాంభీర్యం
వాక్యాల వలపు విరుపు
బిగి కౌగిలి తెలుగు బిగువు
స్వరలయల విపంచిగా
భాషల్లో గీత ఘనత!
మన తెలుగుకున్న బిగువు
మరువకుమా నీవు?! ॥తెలుగు॥
అమ్మ నాన్న అన్న అక్క
చెల్లె తమ్ముడు వదినె మరిది
అత్త మామ తాత అవ్వ
పిల్చుకుంటే తెలుగుదనం
ఉట్టిపడు కమనీయం!
ముచ్చటిస్తే తెలుగులోన / తేనెజల్లు కురిసినట్లు
కథలు చెబితే తెలుగులోన
జలపాతం సాగినట్లు
పాడుకుంటే తెలుగులోన
కెరటాల్లా ఎగిసినట్లు
పొడుపు కథల దుడుకుతనం
సామెతల చక్కదనం
వ్యంగ్యాల విసుర్లు / చమత్కార కొసర్లు
కనుము తెలుగు ఘనము / భాషల్లో బ్రహ్మము!
మన తెలుగుకున్న బిగువు
మరువకుమా నీవు?! ॥తెలుగు॥

–ఆకుల రాఘవ

పెళ్ళయిన దగ్గరనుంచి శ్రీకాంత్ విముఖతతో వుండటానికి కారణం అతని ప్రేమలేఖ చదివేకే అర్థమయింది. పెద్దవాళ్ళ మూర్ఖత్వాలకి తను బలయి పోయిందన్నమాట. శ్రీకాంత్‌లాంటి వాళ్ళు పెద్దల యందు గౌరవానికో, భయానికో తల్లిదండ్రులు తెచ్చిన సంబంధాలని తలొంచుకుని పెళ్ళిచేసుకున్నందువల్ల జరిగేదేమిటి? తనలాంటి వారి జీవితాలు నాశనం కావడం తప్ప! శ్రీకాంత్‌లాంటి పురుషులు వారి ఆశల్ని, ఆశయాలని చంపుకుని యిష్టంలేని భార్యతో జీవితాన్ని గడపడం, రాజీపడి బ్రతకడంలేదా? ఇలా ఎంత కాలం?" అనుకుంది మహతి.

పెళ్ళయిన కొత్తలో తనూ కామితని చూసింది. డిగ్రీ చేస్తోందనీ ఆడబిడ్డ చెప్పగా వింది. బీదింటి పిల్ల అనీ వీళ్ళకి కావలసిన కట్నకానుకలు తేలేదనీ తిరస్కరించారా? శ్రీకాంత్‌కి కామిత అంత నచ్చినప్పుడు తల్లితండ్రుల్ని ఎదిరించి పెళ్ళి చేసుకోవచ్చు కదా? వాళ్ళకి భయపడి తను బాధపడుతూ నా జీవితాన్నిలా హింసించడం ఎందుకు?

ఆనాటి నుంచీ మహతిలో మరీ స్తబ్ధత ఆవరించింది. ఉన్న కోరికల్ని చంపేసుకుంది. ఏదో నిర్లిప్తత, నిస్పృహలతో జీవితాన్ని నెట్టుకొస్తోంది. బ్రతకడానికి తినాలి, భార్యా భర్తలం గనక కలిసి జీవించాలనే వేదాంతాన్ని మనసుకి పట్టించుకుని కాలం గడుపుతోంది.

❖ ❖ ❖

చచ్చీచెడీ రెండు డింకీలు కొట్టి ఎలాగో పి.జి. అయిందనిపించుకుని చదువుకి ఉద్యోగం రాక టైపు వగైరాలు నేర్చుకుని చివరికి స్టెనోగా స్థిరపడ్డాను. నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో నా స్నేహితులంతా "అరే! అచ్చు నువ్వు దిలీప్‌కుమార్‌లాగుంటావు. బోంబేలో వుండికూడా సినిమావాళ్ళ కళ్ళపడకపోవడమేమిటి? ఒక్కసారి ఏదన్నా స్టూడియోకెళ్ళి నీ లక్కు పరీక్షించుకోకూడదూ?" అని తెగ పొగిడేసి, పోరడంతో, కాలరెత్తుకుని సినిమా స్టూడియోల చుట్టూ చదువు మాని తెగ తిరిగాను. అదీ సున్నా చుట్టింది. ఫలితంగా పరీక్షల్లోనూ అన్నీ సున్నాలే వచ్చాయి. దాంతో యిలా సెటిలవక తప్పలేదు.

అదొక్కటేకాదు. నాలో మరో గొప్ప క్వాలిటీ వుంది. అది సైట్ సీయింగ్ పిచ్చి. వయసొచ్చిన దగ్గర నుంచీ సైట్ సీయింగ్ చేసేవాడిని. అంటే ప్రకృతి సౌందర్యం అనుకునేరుస్మీ! కాదు, కాదు. ఆడ సీయింగ్! అర్థమయిందనుకుంటాను. చక్కనైన యువతులు

కళ్ళబడితే నా కళ్ళు వారిని వెంట తరిమేవి. రోడ్డుమీద నడుస్తున్నా ఎప్పుడూ నా కళ్ళు మేడల మీదకో, ఎదర, వెనక నడిచే యవ్వనుల వెంటో పరిగెడుతూ, కళ్ళతో తడిమేస్తూ, నమిలేస్తూ వుండేవి. అలాంటి టైములో ఒకటి రెండుసార్లు కార్లనీ, బస్సుల్ని ఢీకొట్టి చచ్చి బ్రతికాను కూడా. అయినా ఆ ఆడసీయింగ్ మాత్రం మానలేకపోయాను.

అమ్మా నాన్న సంబంధాలు ఓ పాతిక చూసి వుంచామని పెళ్ళిచూపులకి రమ్మని రాసినప్పుడు అనుకున్నాను. నాక్కాబోయే భార్య బొమ్మలా, సీతాకోక చిలుకలా, హీరోయిన్లా వుండి తీరాలనీ. నా ఈ ఆడ సీయింగ్ ఆమెవల్ల తీరాలని, అందుకు ఆరు నూరైనా, నూరు ఆరైనా నా నిర్ణయం వాళ్ళకి చెప్పి, చక్కని చుక్కనే పెళ్ళిచేసుకోవాలని గట్టిగా నిర్ణయించేసుకున్నాను.

సాయంకాలం సినిమా నుంచి వచ్చిన చెల్లాయి 'హాయ్, ఏ బండికొచ్చావురా అన్నయ్యా!' అంటూ పలకరిస్తుంటే నేను జవాబు చెప్పడం మర్చిపోయి దాని పక్కన వున్న చెల్లాయి స్నేహితురాలిని మతిపోయిన వాడిలా చూస్తూ పరిసరాల్ని మర్చిపోయి నిలబడిపోయాను. ఆ అమ్మాయి అది గ్రహించి "వస్తానే శ్యామూ!" అంటూ తుర్రుమంది. నేను కోరుకున్న అందాలన్నీ ఆ అమ్మాయిలో కనపడడంతో చెల్లాయిని తైరుకొట్టి ఆమె స్నేహితురాలి వివరాలు, మంచి చెడ్డలూ సేకరించాను.

ఆ అమ్మాయి పేరు కామితనీ, డిగ్రీలో వుందనీ, స్కాలర్‌షిప్‌తో చదువుతోందనీ, చాలా బీదింటి పిల్లనీ, తెలివైనదనీ చెప్పింది శ్యాము.

రాత్రి తల్లీ తండ్రీ సంబంధాల లిస్టు చదువుతూ, ఎవరెవరెంతెంత కట్నకానుకలిస్తారు? ఏ పిల్లకి ఎంత ఆస్తి వస్తుందీ, ఏ పిల్లకి పెద్ద ఉద్యోగం – వంటివి చెప్తున్నప్పుడు చెల్లాయి వచ్చి "అమ్మా! అమ్మా! అన్నయ్య కళ్ళు కామిత మీద పడ్డాయే. ఇందాకా వివరాలు అడిగాడు" అని చెప్పగానే తల్లీ, తండ్రీ త్రాచుపాముల్లా లేచి వాళ్ళకేముందిరా! రేపీ పిల్ల గడిస్తేగానీ సరిగ్గా తిండికే లేదు. వెనక నలుగురికీ ఈ పిల్లే దిక్కు. పైస కట్నం యివ్వలేరంటూ ఒక్క మాటలో నా ఆశల మొగ్గనీ తెంపి పారేసారు. అయ్యో– కోరికలు కోరుకోవడమే గానీ తీరేదారి లేదులాగుంది. ఏం చేస్తాం?" అంటూ నోరు మూసుకుని వాళ్ళు చూపించిన నూటొక్క సంబంధాలూ చూసి, వారికి నచ్చిన కట్నకానుకలతో వచ్చిన పిల్లకి మూడుముళ్ళూ వేయించారు. ఇంత జరిగినా నా భార్యని గురించి రాయడం అనవసరం. నా మనసులో కామిత రూపం నాటుకుపోవడంతో నా భార్య అందరికీ నచ్చినా నాకు మాత్రం బలవంతపు తద్దినమే అనిపించి చాలాకాలం విముఖతతో దూరంగానే వుండేవాడిని. రాను రాను మానవ

## తెలుగు పరిమళాలు

మేఘం వర్షించి, పుడమి పులకరించి
అన్న దాతను పలకరించే
కమ్మని మట్టివాసన తెలుగు భాష
అమ్మ పిలిస్తే, నాన్న పలుకరిస్తే
పసిమొగ్గలు పులకరించే
తియ్యని పల్లె పిలుపు తెలుగు భాష
దేశ భాషలందు తెలుగు లెస్సగా
కవిరాజు కలవరించిన తెలుగు భాష
ఖండ ఖండాంతరాలలో కొనియాడబడిన
'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' తెలుగు భాష
సామెతలతో, జాతీయ నుడికారాలతో
జీవనదిలా ప్రవహించిన తెలుగు భాష
వేమన పద్యాలు, సుమతీ శతకాలతో
పండిత పామరులను అలరించిన తెలుగు భాష
నేడు ఎందుకో 'తెలుగు వెలుగు' తగ్గుతున్నది
ఆంగ్లం మోజులో దారి తప్పుతున్నది
ఇంగ్లీషు రాదా? "అయితే నీ జీవితం వృథా!"
అనే వికృత భావనను తరిమి కొడదాం.
సందు సందునా ఇంగ్లీషు కాన్వెంటులు
మమ్మీ, డాడీల వ్యామోహపు కలవరింతలు
ప్రాథమిక విద్యా మడిలో తెలుగు అక్షరాలను
విత్తుదాం
తల్లి పాలలా తెలుగు స్వచ్ఛమని చాటుదాం
ప్రభుత్వ కార్యాలయాల జీవోలకు
తెలుగు మాటల దుస్తులు తొడుగుదాం
దుఖాణాల పేర్లకు
తెలుగు వెలుగులు అద్దుదాం
వీధులకు కవుల పేర్లను పెడదాం
తెలుగు భాషోత్సవాలను ఘనంగా జరుపదాం
తెలుగులోనే సంభాషిద్దాం!
తెలుగు సువాసనలతో పరిమళిద్దాం!!

–కొణతం వెంకట రమణారెడ్డి

సహజమైన కోరికల్ని చంపుకోలేక కాపురం చేస్తున్నప్పటికీ నా పాత సౌందర్యారాధన మాత్రం మానుకోలేదు. బజారుకెళ్ళినా, పార్టీలకెళ్ళినా, ఫంక్షన్లకెళ్లినా అసలు కార్యక్రమం మర్చిపోయి అందమైన ఆడపిల్లల కోసం వెతుక్కోవడం, కనబడగానే కళ్ళు వాళ్ళవైపుకి తిప్పి లొట్టలెయ్యడం కాస్త ఎక్కువే అయింది.

చాలాసార్లు నా(దుర) అలవాటుని మానుకోవాలని ప్రయత్నించినా, తీరా ఏ స్లీవ్‌లెస్ గౌనమ్మాయో కనపడేసరికి నరాలన్నీ జివ్వుమని నాకు తెలీకుండానే ఆ కనకాన్ని వెంటాడేవి నా కాళ్ళు.

ఓ రోజు బజారుకెళ్ళి కూరలు కొంటున్నాను. వచ్చీరాని హిందీలో తియ్యటి స్వరం కూరల ఖరీదడుగుతోంది. యథాప్రకారం నరాలు లాగేసి తల గిర్రున తిప్పేను. కళ్ళు జిగేలుమన్నాయి. ఆమె ఎవరో కాదు, శ్యామూ ఫ్రెండు కామిత!! నా ఆరాధ్య దేవత– నా ప్రేమమూర్తి!!

"నన్ను గుర్తుపట్టేరా?" అన్నాను చిన్నగా నవ్వుతూ.

"మీరా! శ్యామూ అన్నయ్య కదూ" అంది.

తరువాత అడిగిన విషయాలకి తనకి బ్యాంకు ఆఫీసరుగా ఈ ఊరికి బదిలీ అయిందని, ఇక్కడికి దగ్గర్లోనే రూం తీసుకుని వుంటున్నానని చెప్పి, విజిటింగ్ కార్డు ఇచ్చి, "మీ ఆవిడతో ఓసారి మా ఇంటికి రండ"ని ఆహ్వానించింది. మిస్ కామిత అన్న అక్షరాలు చదవగానే మళ్ళీ మనసు గాలిలో తేలి నాట్యమాడసాగింది. "అలాగే తప్పక వస్తామ"ని చెప్పి పట్టలేని ఆనందంతో వచ్చేశాను.

❖ ❖ ❖

"ఏయ్ మిస్టర్! నువ్వు వేస్తున్న ఈ వెకిలి వేషాలకి ఒక్క తిట్టడమే కాదు పులుసులోకి ఎముక లేకుండా చితక్కొట్టిద్దును. ఇలా చీవాట్లతో వదిలెయ్యడానికి కారణం నీ ముఖం చూసి కాదు. నీ చెల్లెలికి, నాకూ మధ్య వున్న స్నేహాన్ని గుర్తుచేసుకునే తెలుసా?"

"నిజంగా నన్నంతగా ప్రేమించి వుంటే మీ అమ్మా, నాన్నతో చెప్పి, వాళ్ళని ఒప్పించి పెళ్ళి చేసుకోలేకపోయావా? ఆ ధైర్యంలేక వెనక వెర్రివేషాలేసి, పిచ్చి చూపులు చూడటం దేనికి? పోనీ ఏదో పెళ్ళి కానివాడివి వెర్రివేషాలేస్తున్నావనుకున్నాను. కానీ పెళ్ళి చేసుకుని, కాపరం చేస్తూ కూడా వీధంట పడి కుక్క కూటికి ఆశపడుతున్నావా? మర్యాదగా బ్రతుకుతున్న నాలాంటి వాళ్ళని రోడ్డు మీదకి లాగాలని చూస్తున్నావు. సరే చెడగొడతావు– ఆ తరవాత నాగతేమిటి? పుస్తెకట్టి పోషిస్తావా? పెళ్ళి కాకుండా వున్నానుకదా అని నీకు ఉంపుడుగత్తెగా రమ్మనగానే వస్తాననుకున్నావా? మగాడినన్న అహంకారంతో పిచ్చి, పిచ్చి వేషాలెయ్యకుండా కట్టుకున్న పెళ్ళాం దగ్గర బుద్ధిగా పడుండటం

## గమ్యమెరుగని బతుకు

ఇక్కడి అధికార పాదాల వద్ద
నౌకరీ మొక్కలు శిరస్సులు నిలపాలి
మనసులోని కలతల్ని చెదరగొట్టేందుకు
కాలం విలువల్ని, కరిగిస్తుంటాడు
క్రిందివాళ్ళ చూపులకి చిల్లులు పెట్టి
తన కళ్ళల్లో వెలుతురు నింపుతుంటాడు
పలుకుల విరుపుల ప్రవాహానికి
ఆనందం కాస్త కొట్టుకుపోయి
వేదన, గోదావరిలో ఇసుక మేటవుతాది
తృప్తి మొక్కలు మొలవకుండా
గుండెను ఎండ్రిన్ పోసి కడుగుతాడు
బానిసత్వపు సానరాతి మీద
మనిషి బతుకును అరగదీసి
వీధి గుమ్మానికి – పసుపు, పారాణిలా పూస్తాడు
వాడు అధికారి మరి–
ఒక్కడి అహంకార ప్రజ్వలనానికి
పదిమంది మంటలో కాలుతుంటారు
బడాయి బతుకు పచ్చగుండటానికి
చిరుద్యోగి జేబుకి చిల్లుపడుతుంది
బెదిరింపుల పెత్తనం విసిరిన కత్తికి
అమాయకుల నసీబు నుండి నెత్తురు కారుతుంది
హోదాను, తలకు పాగాగా చుట్టి
చుట్టూ వున్న వాళ్ళ వీపులపై కాలుమోపి
రాజ్యాధికార చిహ్నా సింహాసనంపై కూర్చుంటాడు
వాస్తవాలు దర్శించలేని కళ్ళకు
భ్రమల చిత్రాల్ని అతికించుకుంటాడు
కోరికల ప్రవాహం మీద
ఆనందం నావని పరిహాస్తాలతో నడిపిస్తాడు
గమ్యమెరుగని బతుకు వాడిది
మాయాలోక విహార యాత్రా తరంగాల నుండి
ఒడ్డుకు చేరే రోజు వాడికే తెలియదు
ప్రజలారా క్షమిస్తారా? శిక్షిస్తారా?

–యస్. ఆర్. పృథ్వి

నేర్చుకో. నీలాగే నీ భార్యని కూడా మరొకడు కన్నెత్తి చూస్తే సహించగలవా? అయినా నువ్వు రాసిన ప్రేమ లేఖ వెంటనే నీ పెళ్ళానికి పోస్టు చేశాను. ఆవిడ నీకు గడ్డిపెట్టలేదా? లేక అదీ నీ చేతిలోనే పడిందా? అప్పుడు ఏదో కుర్రచేష్టలు, ఇప్పుడు తిన్నబిడి వుంటా వనుకుని నీ భార్యతో రమ్మని ఆహ్వానిస్తే, ఒక్కడివే వచ్చి వెర్రివాగుడు వాగుతున్నావా? మర్యాదగా బైటికి నడు. మళ్ళీ ఈ దరిదాపుల్లో కనబడితే కాళ్ళూ చేతులూ విరగ్గొట్టిస్తాను. నా దగ్గరే కాదు, మరెవ్వరి దగ్గరా ఇలా ప్రవర్తించక, కట్టుకున్న భార్యతో కాపరం చేసుకో. ఆడవాళ్ళు నువ్వనుకున్నంత చవకబారు మనుషులు కారు" అంటూ భళ్ళున తలుపులు మూసేసింది.

తలుపు నుదుటికి తగిలి పెట్టిన నొప్పికంటే, కామిత పెట్టిన చీవాట్ల కంటే, నీ ప్రేమలేఖ నీ భార్యకి పంపేను. అందలేదా? అన్న మాటలు పుట్టిస్తున్న గాబరా, భయాన్ని దాచుకోలేకపోతున్నాడు శ్రీకాంత్.

మహతి తన్ని అసహ్యించుకుని, ఎందుకు దూరంగా వుంచుతోందో యిప్పుడు పూర్తిగా అర్థ మయింది. ఇంటికి వస్తున్నా, ఆలోచనలు బుర్ర తొల్చేస్తున్నాయి.

"ఆ- ఆఫ్టరాల్ ఆడది. నా పెళ్ళాం నన్నేం చేస్తుందిలే! అయినా ఎందుకేనా మంచిది" అనుకుని బజారు వైపుకి నడిచి ఓ మంచి చీరా, పూలూ, స్వీట్లూ కొని ఇంటివైపుకి నడిచాను.

ఎప్పుడూ లేనిది ఇంటి తలుపు తాళం వేసి వుండ డం ఆశ్చర్యంగా చూస్తున్న నాకు పక్కింటి అబ్బాయి వచ్చి యిచ్చిన తాళాలందుకుని తలుపు తీసాను. బల్లమీద పేపర్ వెయిట్ క్రింద మహతి రాసిపెట్టిన వుత్తరం గాలికి ఎగురుతూ కనబడింది.

"శ్రీకాంత్ గారూ! అన్యోన్యం, అనురాగం లేని భార్యాభర్తలు ఓ యింట్లో జీవించడం ఎంత దుర్లభమో బాగా తెలిసింది. పెళ్ళయిన దగ్గర నుంచి మన జీవిత రైలు కలవని పట్టాలమ్మటే నడిపిస్తూ ఆనందం లేని జీవితాన్ని గడుపుతున్నాము. ఇష్టంలేని భార్యతో కాపు రం చెయ్యవలసి రావడం వల్ల మీ మనసు ఎప్పుడూ పరాయి ఆడవారి మీదే వుంటోంది. అది నేను కనిపెట్టినా చాలాకాలం ఓర్చుకున్నాను.

ఈ రోజు మీ చెల్లెలు రాసిన వుత్తరం నా ఈ నిర్ణయానికి కారణం. మీ ప్రేయసి ఈ ఊరి బ్యాంకికి బదిలీ అయి వచ్చిందిట ఆమె యింకా మిస్‌గానే వుందిట. ఈ విషయం తెలిసాకా అనిపించింది. మీ ఆరాధ్య దేవతని మీరు పెళ్ళి చేసుకుని ముందు జీవితాన్నయినా ఆనందదాయకం చేసుకుని హాయిగా వుంటే బాగుంటుందని. అయిష్టతతో కలిసి వుండేకన్నా, కోరుకున్న వారితో హాయిగా వుండడం మంచిది కదా! ఇటీవల మీరు ప్రేమ నటిస్తున్నా అది కపటంగా నాకు కనిపిస్తోందేగానీ ఆప్యాయతని కనబర్చటంలేదు. ఇంక సర్దుకుని బ్రతికే శక్తి నాలో నశించింది. జీవితమంటే ఒకవిధమైన నిరాసక్తత కలిగింది. అందుకే యిల్లు విడిచి వెళ్ళిపోతున్నాను. నాకున్న విద్యతో ఎక్కడన్నా గౌరవంగా బ్రతకగలనన్న ధైర్యం నాకుంది.

సెలవు

ఇలా మహతి"

ఆ ఉత్తరంతో పాటు అతని చేతిలోని పూలూ, పేకెట్లూ, నెలమీద పడి దొర్లుతూ వెక్కిరిస్తుంటే వెర్రి వాడిలా కూలబడిపోయాడు శ్రీకాంత్. ■

## ఎస్.ఎం.ఎస్.

**నా** తీవ్ర ఆలోచనలకు గండికొడుతూ
నా సక్రమాన్ని అక్రమాల్ని చేస్తూ
'విధిరాత'గా వస్తుంది ఎస్సెమ్మెస్!
ఏ ఆత్మీయుని అనురాగపు గుబాళింపో
ఏ అభిమాని సహృదయపు స్పందనో
ఏ శ్రేయోభిలాషి దివ్య సందేశమో
అనుకుంటూ... ఓపెన్ చేస్తే...
అదొక వ్యాపారపు తుమ్మముల్లు
రింగ్‌టోన్ల ప్రకటనల కంపుజల్లు!
ప్రశాంతతకీ నిద్రకీ చెల్లు!
ఈ ఎస్సెమ్మెస్
ఛానల్స్‌కి ఓ కుబేర నిధి ఓ వరాల పంట!
పాప బోరుబావిలో కొట్టుమిట్టాడుతూంటే
ఆసిడ్ మొహంతో నరకయాతన పడుతూంటే
కోట్లు గడిస్తూ క్రికెట్‌తో పైలాపచ్చీసుగా వుంటే
ఎస్సెమ్మెస్‌లతో ఆటపాటలా?
మనల్ని ట్రాన్స్‌లోకి తీసుకువెళ్తున్నా-
మన మీద వల వేస్తున్నా
మన విలువైన సమయాన్ని మూల్యం చేసుకొంటున్నా
ఎస్సెమ్మెస్ తెరిచిన రోజు
నిజంగా సంతాప దినమే!

-ద్వా. నా. శాస్త్రి